
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0



కొరవడిన నిఘా



- ఆహ్లాదం కోసం వచ్చే ప్రాంతాల్లోనూ అసాంఘిక కార్యకలాపాలు
- సీసీ కెమెరాల నిఘా అంతంతే.. పెట్రోలింగ్ మృగ్యం
- ఆ ప్రదేశాలకు వెళ్తున్న ప్రేమ జంటలే ఆకతాయిలకు టార్గెట్
- జన సంచారం తక్కువ ఉన్న ప్రాంతాలు తాగుబోతులకు అడ్డా
- అక్కడే గంజాయి సేవనం.. మద్యం సిట్టింగులు.. జోరుగా పేకాట
- ఆకతాయిలు బెదిరించి వేధిస్తున్నా.. పరువు కోసం ఫిర్యాదు కరవు



వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూరు ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో వేసిన మద్యం సీసాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆహ్లాదం, ఆధ్యాత్మికతను పంచే ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారుతున్నాయి. తాగిన మైకంలో ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు, లైగింక వేధింపులు, బెదిరింపులకు కేంద్రాలవుతున్నాయి. కొరవడిన నిఘా నేత్రాలు, పెట్రోలింగ్ బృందాల గస్తీ లేని కారణంగా ఆకతాయిలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా ఊర్కొండపేటలో మహిళపై జరిగిన అత్యాచార ఉదంతం పలు ప్రాంతాల్లో కలకలం రేపుతోంది. తమ ప్రాంతాల్లో కూడా ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయని కొందరు బాహాటంగానే చెబుతున్నారు. పెరుగుతున్న టెక్నాలజీ ప్రభావం, అందుబాటులో ఉంటున్న మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకూ పెరుగుతుండటంతో యువత గాడి తప్పుతోంది. మహిళపై అత్యాచార ఘటనలో నిందితులుగా రిమాండ్‌కు పంపిన వారంతా యువకులే కావడం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ విషయమై పోలీసులకు పలువురు సమాచారం అందిస్తున్నా, పలు జిల్లాల్లో పట్టింపు లేకుండా పోయింది. ప్రధానంగా ఆహ్లాద ప్రాంతాలకు వస్తున్న వారు మేజర్లు కావడం, వారిని ప్రశ్నించే అధికారం లేకపోవడం, సున్నితమైన అంశం కావడంతో మందలించలేకపోవడం అధికారుల నిస్సహాయతగా మారుతోంది. ఇదే అదునుగా పోకిరి ముఠాలు చెలరేగుతున్నాయి. ఊర్కొండపేట ఘటనలో పట్టుబడ్డ నిందితులు రోజూ ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఈ ఆకతాయిలకు అడ్డుకట్ట పడకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదం లేకపోలేదు.

ప్రేమ జంటలే టార్గెట్..

ఉమ్మడి పాలమూరు ప్రతీ జిల్లా కేంద్రం సమీపంలో ప్రజలు కాసేపు ఆహ్లాదంగా గడపటం కోసం ఎకో పార్కులను ఏర్పాటు చేశారు. అక్కడికి ఉదయం వేళల్లో వాకర్స్ వస్తుండగా, సాయంత్రం వేళల్లో ఫ్యామిలీస్ వస్తున్నాయి. ఇక కాలేజీ సమయం ప్రారంభమైన తర్వాత నుంచి ప్రేమ జంటలకు పార్కులు ఆవాసాలుగా మారాయి. ఆ సమయాల్లో అటు వెళ్లాలంటే మిగతావారు జంకుతున్న పరిస్థితి ఉంది. మరి ఆ పార్కులు మొత్తం సీసీ కెమెరాల నిఘా ఉందా? అంటే అదీ లేదు. కేవలం ఎంట్రెన్స్‌ల వద్ద మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎవరూ రారనే

(మిగతా 6లో..)



సొరంగంలో సహాయక చర్యలను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఎస్‌ఎల్‌బీసీ పనులు పూర్తి చేస్తాం

- రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

దోమలపెంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):ఎన్ని అవాంతరాలు ఎదురైనా రాబోయే రెండున్నర సంవత్సరాలలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలో ఉన్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగాన్ని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసిందన్నారు.

తొందరలోనే సహాయ చర్యలు పూర్తి చేస్తాం

ప్రమాద ఘటన జరిగిన నాటి నుంచి 40 రోజులుగా రెస్క్యూ బృందాల్లో 700 నుంచి 800 మంది నిత్యం విశ్రాంతి లేకుండా పనులు కొనసాగిస్తున్నారన్నారు. 250 మీటర్ల వరకు పెద్దపెద్ద బండరాళ్లు, మట్టి దిబ్బలు కూలిపడటం అందులో టీబీఎంకు సంబంధించిన స్ట్రక్చర్ విరిగి పోవడంతో సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్నదన్నారు. ఇప్పటి వరకు 100 మీటర్లకుపైగా శిథిలాలను తొగించినట్లు చెప్పారు. తొందరలోనే సహాయ చర్యలు పూర్తి చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇక ముందు సొరంగం పనుల్లో ఎటువంటి ప్రమాదం, ప్రాణనష్టం జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సొరంగంలో పనుల పురోగతిపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ అవసరమైన సహకారం అందించాలని సూచించారన్నారు. బుధవారం సహాయక చర్యలు, మంత్రి సమీక్షా సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్ కుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి డాక్టర్ హరీశ్, సింగరేణి రెస్క్యూ మైన్స్ జీఎం భైద్య, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, జయప్రకాష్, రైల్వే అధికారి రవీంద్రనాథ్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

-మంత్రి జూపల్లి కృష్ణారావు



నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఎస్పీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులకు కఠినమైన శిక్ష విధించాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. తక్షణమే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వారికి శిక్షపడేలా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలు అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. తమ పిల్లలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉంచుకోవాలన్నారు. ప్రధాన దేవాలయాలు, ట్యాంక్‌బండ్ వంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి తగిన విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. మహిళలు బయటకు వెళ్లినప్పుడు తగు విధంగా జాగ్రత్తలు తీసుకోవాల్సినవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులతోపాటు సమాజంలో ఉన్న ప్రతీ ఒక్కరు మానవతా దృక్పథంతో మహిళల రక్షణకు సహకరించాల్సినవసరం ఉందన్నారు.

సన్న బియ్యం.. సంతోషం



ఆత్మకూరు మండలంలోని ఖానాపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్

6

శాంతి భద్రతలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

7

మత్తు చిత్తు

- ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు
- మత్తుకు బానిసలవుతున్న యువకులు
- నామమాత్రంగానే నమోదవుతున్న కేసులు
- ఊర్కొండ పేట ఘటన గంజాయి బ్యాచ్ పనేనంటూ ఆరోపణలు



నారాయణపేటలో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న అబ్కారీ శాఖ అధికారులు (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గంజాయి విక్రయాలు అడ్డగోలుగా కొనసాగుతున్నాయి. టీనేజీ పిల్లలు గంజాయికి బానిసలుగా మారి ఎలాంటి అరాచకాలు చేయడానికైనా సిద్ధపడుతుండటంతో వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నది. మరోవైపు ఊర్కొండపేట లాంటి సామూహిక అత్యాచార ఘటన చోటుచేసుకోవడంతో మహిళలు స్వేచ్ఛగా తిరగలేక పోతున్నారు. దైవదర్శనానికి వచ్చిన వివాహితపై ఏడుగురు అత్యాచారానికి పాల్పడిన ఘటన వెనుక గంజాయి బ్యాచ్ ఉన్నదని ఆరోపణలు రావడంతో ఆందోళన మరింత తీవ్రమైంది. గంజాయిని సరఫరా చేసే ముఠాపై ఉక్కుపాదం మోపకుంటే రానురాను పరిస్థితి మరింత దిగజారుతుందనే ఆందోళన అన్ని వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ప్రతీ ఏటా పెరుగుతున్న కేసులు

గంజాయి సరఫరాకు సంబంధించి ప్రతీ ఏటా కేసుల సంఖ్య పెరుగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2024 జనవరి 1 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 1 వరకు పది గంజాయి కేసులు నమోదయ్యాయి. మొత్తం 1276 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒక్క నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఆరు కేసులు నమోదు కాగా బిజినేపల్లిలో రెండు, అమ్రాబాద్, ఊర్కొండ మండలాల్లో ఒక్కో కేసు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 20 మందిని అరెస్టు చేశారు. నారాయణపేట జిల్లాలో గతేడాది మూడు కేసులు నమోదు కాగా మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మద్దూరు ఠాణాలో ఒక కేసు నమోదైంది. ఇక్కడ 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా 89 గంజాయి మొక్కలు కూడా లభ్యమయ్యాయి. వనపర్తి జిల్లాలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. 2023లో మూడు కేసులు నమోదు కాగా 4.399 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్టు చేశారు. గతేడాది రెండు కేసులు నమోదు కాగా 207 గ్రాముల గంజాయి పట్టుకొని ముగ్గురిని అరెస్టు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో కూడా గంజాయి స్మగ్లింగ్, వాటి మొక్కల సాగు జోరుగా ఉన్నట్లు ఎక్సైజ్ అధికారుల నివేదిక ద్వారా తెలుస్తోంది. 2024లో ఉండవల్లి సమీపంలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు 18 గ్రాముల గంజాయిని ఒక టీ హోటల్ దగ్గర విక్రయిస్తుండగా పట్టుకున్న పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

నల్లమల నుంచి జోరుగా సరఫరా

నల్లమల అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్, ముంబయి, చెన్నైతో పాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్, రాయలసీమలోని కర్నూల్ జిల్లాలకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సరఫరా జరుగుతున్నట్లు తెలుస్తోంది. లోతట్టు అటవీ ప్రాంతం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కూడా అతి కష్టం మీద చేరుకునే ప్రదేశాల్లో స్మగ్లర్లు కొందరి ద్వారా గంజాయిని పండిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్కడే గంజాయిని ఎండబెట్టి పర్యాటకుల రూపంలో కృష్ణానది ద్వారా పుట్టిపై ప్రయాణించి పెబ్బేరు మీదుగా హైవేకు చేరుకొని అక్కడి నుంచి వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

నల్లమల ఎగువ ప్రాంతం నుంచి భక్తుల రూపంలో దోమలపెంట, మన్ననూర్ ప్రాంతాలకు చేరుకొని అక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణించి హైదరాబాద్‌లో తాము ఏర్పరచుకున్న అడ్డాలకు చేరుస్తూ కాలేజీ విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నారు. ఈ అంశం అనేక కేసుల్లో పట్టుబడిన నిందితుల నుంచి పోలీసులకు స్పష్టమైన సమాచారం ఉన్నది.

ప్రశాంతంగా ముగిసిన.. పది పరీక్షలు



చారకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష అనంతరం సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థులు



వనపర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్షరాసి బయటకు వస్తున్న విద్యార్థులు



మానవపాడులో పరీక్ష రాసిన అనంతరం విజయోత్సవంలో విద్యార్థినులు

నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి విద్యావిభాగం/గద్వాల సర్కిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత నెల 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 10,259 మంది విద్యార్థులు హాజరయ్యారు. 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ చివరి రోజు కల్వకుర్తి పట్టణంలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కల్వకుర్తి పోలీసుస్టేషన్ నుంచి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడి పరీక్షల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహరించిన అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన 10వ తరగతి పరీక్షలకు 6,840 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి అబ్దుల్ ఘని తెలిపారు. ఖిల్లాఘణపూర్‌లోని ఓ పరీక్ష కేంద్రంలో పరీక్ష కొనసాగుతున్న తీరును ఆయన పరిశీలించారు. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 40 పరీక్షా కేంద్రాల్లో 7,567 మంది విద్యార్థులు హాజరయ్యారని, 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని, పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. వృత్తి విద్యకు సంబంధించిన వివిధ కోర్సుల పరీక్ష మాత్రం గురువారం నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, విశ్వభారతి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేలా విధులు పకడ్బందీగా నిర్వహించిన సీఎస్, డీవో, ఇతర అధికారులను, ఇన్విజిలేటర్లను ఇన్‌చార్జి డీఈవో, అసిస్టెంట్ కమిషనర్‌లు అభినందించారు.



పది పరీక్షలు ముగియడంతో వనపర్తి పట్టణంలో వీడ్కోలు చెప్పుకుంటున్న విద్యార్థినులు



వనపర్తి జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు

బీడీ కార్మికుల స్థలాలు అన్యాక్రాంతం

- పట్టాలిచ్చిన ప్రభుత్వం - డంపింగ్ యార్డుగా మార్చిన మునిసిపాలిటీ



మునిసిపాలిటీ చెత్తతో నిండిన బీడీ కార్మికుల కేటాయించిన ఇళ్ల స్థలం

6

కొత్తకోటలో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత కాస్త తగ్గింది. రెండు రోజుల నుంచి వాతావరణం చల్లబడింది. రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తున్నాయి. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా అమరచింత మండలంలో 21.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 35.9, కనిష్ఠంగా 24, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 34, కనిష్ఠం 24 డిగ్రీలు నమోదైంది.

ఇసుక నిల్వల పరిశీలన

మిడ్జిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ములలో ఇసుక నిల్వలను బుధవారం మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ సుజాత, తహసీల్దార్ రాజు, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు పరిశీలించారు. సీసీ రోడ్డు నిమిత్తం ఇసుకను అక్కడ పోశారని, నిల్వలకు సంబంధించిన ప్రభుత్వ పని అధికారిక పేపర్లను తాము చూశామని తహసీల్దార్ తెలిపారు.

నిందితుల వాహనాలు సీజ్?

ఊర్కొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అత్యాచార ఘటన నిందితుల వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఊర్కొండపేటలోని నిందితుల స్వగృహాలకు చేరుకొని మారుపాకుల ఆంజనేయులుగౌడ్‌కు చెందిన ఆటో, బైకుతో పాటు హరీశ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, మణికంఠకు సంబంధించిన బైకులు తీసుకెళ్లారు.

స్కూటీ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపు తప్పి ముగ్గురు బాలురకి గాయాలయ్యాయి. పట్టణంలోని మోతీనగర్‌లో ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్ వాచ్‌మన్ కుమారుడు తండ్రి స్కూటీ తీసుకుని ఇద్దరు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారు. కొద్దిదూరం వెళ్లగానే మోతీనగర్ రైస్‌మిల్లు వద్ద స్కూటీ అదుపు తప్పడంతో ముగ్గురూ పడిపోయారు. ఇందులో ఒక విద్యార్థికి కాలు విరగగా, మిగతావారికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక వ్యాపారిపై కేసు నమోదు

మూసాపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లిలో గత నెల 28న చోటు చేసుకుంది. ఎస్ఐ ముల్కలపల్లి వేణు తెలిపిన వివరాల ప్రకారం.. కొమిరెడ్డిపల్లికి చెందిన ఇసుక వ్యాపారి మామిళ్ల విజయకుమార్ తన మినీ డీసీఎంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా గమనించిన పోలీసు కానిస్టేబుల్స్ అడ్డుకోబోయారు. ఎలాగైన తప్పించుకోవడం కోసం పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ వాహనంపైకి దూసుకొచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దీనిపై విచారించి మామిళ్ల విజయకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బుధవారం మామిళ్ల విజయకుమార్‌ను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ విధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి బుధవారం తెలిపారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారితో సమావేశం నిర్వహించి విద్యార్థి లోకేష్‌కు మూడు నెలలు, హర్షవర్ధన్‌కు రెండు నెలలు, హేమవర్ధన్‌కు నెలరోజుల పాటు సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని ప్రిన్సిపాల్ సూచించారు. అసభ్యంగా ప్రవర్తించిన వ్యవహరించిన ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

గద్వాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటోనిపల్లి గ్రామానికి చెందిన నవీన్(35) మేస్త్రీ కింద పనిచేయడానికి వీరాపురం గ్రామ సమీపంలో నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేట్ పాఠశాల ద్వారా నిర్మాణ పనులకు ఇనుప పైపులతో అట్టడి వేస్తున్నారు. ఈ క్రమంలో పైపు పైకి ఎత్తుతుండగా అదుపు తప్పి ఒరిగి పక్కనే ఉన్న హెచ్‌టీ విద్యుత్‌వైర్లకు తగిలింది. షాక్‌కు గురై నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూగర్భజలాలను కాపాడాలి

వంగూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దుందుభీ నది వాగు పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించి భూగర్భజలాలను కాపాడాలని నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని జాజాల గ్రామ రైతులు కోరుతున్నారు. పోతారెడ్డిపల్లి శివారులో వాగు సమీపంలో ఓ రైతు పొలంలో ఇసుకను తీసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఆ ప్రాంతాన్ని రైతులు బుధవారం సందర్శించారు. టిప్పర్లలో ఇసుక భారీగా తరలిపోయే అవకాశం ఉందని దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి, వ్యవసాయ బోర్లలో నీరు లేక ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే కలెక్టర్ స్పందించి ఇసుక అనుమతులను రద్దు చేయాలని రైతులు కోరారు.

ఫూలే విగ్రహావిష్కరణపై సమీక్ష



బిజినేపల్లిలో అభివాదం చేస్తున్న పలు సంఘాల నాయకులు

బిజినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో 9న జోతిరావుఫూలే జయంతి పురస్కరించుకొని విగ్రహావిష్కరణ చేపట్టేందుకు కార్యచరణపై సమీక్ష నిర్వహించినట్లు విగ్ర హావిష్కరణ కమిటీ అధ్యక్షుడు అంతటి రాజేందర్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ దాదాపు 20వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం పలువురికి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో మంగి విజయ్, గంగన మోని కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రాజు గౌడ్, వెంకటస్వామి, భగవంత్‌గౌడ్, సత్యశీల సాగర్, బంగారి పర్వతాలు, గంగనమోని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం.. సంతోషం



నారాయణపేటలో రేషన్ దుకాణం వద్ద బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం తినేందుకు ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు పంపిణీ చేసిన బియ్యంతో చేసిన అన్నం బాగుందని చెబుతున్నారు. పండుగలకు మాత్రమే సన్న బియ్యం కొని వండుకునేవారమని, ప్రతీ నెల సన్నబియ్యం పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని లబ్ధిదారులు అంటున్నారు.

- మహబూబ్‌నగర్ న్యూటౌన్/ దేవరకద్ర/ గద్వాల న్యూటౌన్, మక్తల్, ఖిల్లాఘణపురం/నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి)

అన్నం మంచిగ అయ్యింది



ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం అన్నం మంచిగ అయ్యింది. బియ్యంలో నూకలు లేకుండా, పాలిష్ తక్కువగా ఉంది. షాపులలో కొనుగోలు చేసిన బియ్యం మాదిరిగానే ఉన్నాయి. ప్రభుత్వం ప్రతినెల రేషన్‌షాపుల ద్వారా ఈ బియ్యాన్నే సరఫరా చేయాలి. ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయడం ఎంతో సంతోషకరం.

- అరుణ, మోనప్పగుట్ట, మహబూబ్‌నగర్

సంతోషకరం



ప్రభుత్వం రేషన్ దుకాణాలలో అందించే రేషన్ బియ్యం బాగున్నాయి. పాత హౌసింగ్‌బోర్డు కాలనీలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం తీసుకున్నాను. బియ్యాన్ని వండగా అన్నం బాగుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదప్రజలకు సన్నబియ్యాన్ని అందించడం సంతోషంగా ఉంది.

- సుజాత, పాత హౌసింగ్‌బోర్డు కాలనీ, గద్వాల

సన్నబియ్యం బువ్వ బాగుంది



ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యంతో వండిన బువ్వ బాగుంది. దొడ్డు బియ్యంతో అన్నం తినాలంటే ఇబ్బందిగా ఉండేది. సన్నబియ్యం కొనాలంటే మస్తు పైసలు అయ్యేవి. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. ఆ బియ్యం వండుకుని తింటున్నాము.

- సరోజ, యన్మన్‌గండ్ల నవాబ్‌పేట



సింగారంలో బియ్యం తీసుకునేందుకు వేలిముద్ర వేస్తున్న మహిళ

దొడ్డు బియ్యం తినాలంటే ఇబ్బంది



ప్రభుత్వం అందించిన సన్నబియ్యం చాలా బాగున్నాయి. ఇంతకంటే ముందు దొడ్డు బియ్యం ఉండేది. తినడానికి కొంచం ఇబ్బందిగా ఉండేది. సర్కారు వారు ఇచ్చిన సన్న బియ్యం వండినా. మాది బీద కుటుంబం.. ఎన్నడూ సన్నబియ్యం తినలేదు. నాకు 24కిలోల బియ్యం ఇచ్చారు. సన్నబియ్యం ఇస్తారని అనుకోలేదు.

- గడ్డం వెంకటమ్మ, భూత్పూర్

ప్రతీ నెల ఇవ్వాలి



ప్రభుత్వం అందించిన సన్నబియ్యం పేదలకు ఎంతోమేలు చేసేలా ఉన్నాయి. గతంలో దొడ్డుబియ్యం తినలేక చాలా ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం ప్రభుత్వం అందించిన సన్న బియ్యం వండుకొని కుటుంబ సభ్యులందరం భోజనం చేశాము. ప్రతీ నెలా క్రమం తప్పకుండా సన్నబియ్యం పంపిణీ కొనసాగించాలి.

- మంజుల, రెడ్డినగర్, మక్తల్

సన్న బియ్యం పంపిణీ సంతోషకరం



చౌకధర దుకాణాల్లో పంపిణీ చేసిన సన్న బియ్యం నాణ్యతగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొన్ని నెలలు సన్న బియ్యం ఇచ్చి మళ్లీ దొడ్డు బియ్యం ఇచ్చారు. రేషన్ కార్డుదారులు దొడ్డు బియ్యం ఇస్తే విక్రయించి సన్న బియ్యం తెచ్చుకుంటున్నారు. ప్రతి నెల నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- కందూరి సూర్యకళ, ఖిల్లాఘణపురం

వేసవిలో ఉపశమనం

- తాటి ముంజల విక్రయాల జోరు
- గ్రామీణులకు జీవనోపాధి



అయిజలో తాటిముంజలు కుప్పలుగా పోసి అమ్ముతున్న మేడికొండ గ్రామస్థులు

అయిజ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాటి ముంజల డిమాండ్ అంతాఇంతా కాదు. ఇవి శరీరానికి చలువనందిస్తాయని తెలిసిందే. వేసవిలో ఇవి విరివిగా ఎలాంటి పెట్టుబడి, కల్తీ లేకుండా తాటి చెట్టు నుంచి లభిస్తాయి. ప్రకృతిలో లభించే వీటితో గ్రామీణులు ఉపాధి పొందుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి మేడికొండ, మాన్‌దొడ్డి, భూమ్‌పూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల నుంచి గంపలు, ఆటోలలో తాటి కాయలు, ముంజలు తరలించి విక్రయిస్తున్నారు. దాదాపు 450 నుండి 500 గల తాటి ముంజలు కలిగిన గంపలు రూ. 900కు, డజను రూ. 50కు అమ్ముతున్నారు. వీటిని పట్టణంలో అమ్మటంతో స్థానిక మహిళా వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. మరికొంత మంది తాటికాయలను నేరుగా పట్టణానికి ఆటోలో తరలించి అక్కడికక్కడే వేరుచేసి విక్రయిస్తున్నారు.

పదేళ్లుగా అమ్ముతున్నా..



అన్ని కాలాల్లో లభించే పండ్లను అమ్మి జీవనోపాధి పొందుతున్నాను. ఎక్కువగా తాటిముంజలు అమ్ముతాం. గ్రామీణ వ్యాపారస్థుల నుంచి గంపను కొని డజను లెక్కను పట్టణంలో విక్రయిస్తాం. పదేళ్లుగా తాటి ముంజల అమ్మకాలే చేస్తున్నాను. వేకువజామునే గ్రామాల నుంచి అయిజకు తెచ్చిన ముంజలను కొని వీధుల్లో తిరిగి అమ్ముతాను.

- సవారమ్మ, అయిజ



ఆటోలో తాటిముంజలను అమ్ముతున్న ఉప్పల మహేష్

బీడీ కార్మికుల స్థలాలు అన్యాక్రాంతం

- 150 మందికి పట్టాలిచ్చిన ప్రభుత్వం
- ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం
- డంపింగ్ యార్డుగా మార్చిన మునిసిపల్



బీడీ కార్మికుల కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పేరుకుపోయిన చెత్త

కొత్తకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. 1995లో ప్రభుత్వం వడ్డెవాట రోడ్డు బ్రహ్మంగారి దేవాలయ సమీపంలో గల గుట్టలను 150 మంది కార్మికులకు స్థలాలు కేటాయించింది. దీంతో తమకు ఇంటి నిర్మాణానికి నిధులు కావడమే ఆలస్యమని వేచి చూశారు. కానీ అందరికీ ఒకేసారి నిధులు మంజూరు చేయడం భారం కావడంతో వాయిదా పడుతూ వచ్చింది. అనంతరం ప్రభుత్వాలు మారడంతో కాగితాలు చేతిలో ఉన్న ఇంటికి యజమాని కాలేకపోయామని దిగులుగా ఉన్నారు. ఈ ప్లాట్లు సైతం అన్యాక్రాంతం అయ్యావని తెలుసుకున్న కార్మికులు లబోదిబోమంటున్నారు.

డంపింగ్ యార్డుగా వినియోగం

ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. దీంతో మునిసిపల్ అధికారులు డంపింగ్ యార్డు కోసం వినియోగించుకుంటున్నారు. పట్టణంలోని చెత్తను గుట్టల్లోని డంపింగ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బీడీ కార్మికులు, సంఘం నాయకులు డంపింగ్ యార్డును తొలగించి, స్థలాల హద్దులు చూపించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, వినతి పత్రం అందజేశారు.

డంపింగ్ యార్డు తొలగించాలి



బీడీ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంతో కొట్లాడి 150 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించాం. నిర్మాణాలకు నిధుల మంజూరు కోసం ప్రయత్నం చేస్తున్నాం. కార్మికులకు ఇచ్చిన స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం తగదు. వెంటనే చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

-మిషేక్, బీడీ కార్మిక సంఘం నాయకుడు

మా దృష్టికి వచ్చింది



నేను కమిషనర్‌గా ఇటీవల కాలంలోనే బాధ్యతలు తీసుకున్నా. కార్మికుల ఇంటి స్థలాల్లో డంపింగ్ యార్డు విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశా. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక డంపింగ్ యార్డుపై నిర్ణయం తీసుకుంటాం.

- సైదయ్య, మునిసిపల్ కమిషనరు

కాలుష్య కంపెనీల కోసం పర్యావరణాన్ని బలిపెడతారా?

- పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య కంపెనీల కోసం పర్యావరణాన్ని బలిపెడుతున్నారని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం దురాక్రమించడాన్ని ఖండించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 1973లో ఇందిరాగాంధీ ఆరు సూత్రాల పథకంలోని రెండో అంశాన్ని అమలు పరుస్తూ, అంతర్జాతీయ స్థాయిని తట్టుకునే విధంగా 2,300 ఎకరాల భూమిని కేటాయించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పేరుతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం దేశ నిర్మాణానికి అందించిన సామాజిక, వైజ్ఞానిక శాస్త్రవేత్తలు అందిస్తున్న దోహదాన్ని మరిచి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల దురాక్రమణకు సిద్ధపడి అక్కడి పర్యావరణ, జీవా వరణ వ్యవస్థను బుల్‌డోజర్లతో ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధ్వంసాన్ని, భూ దురాక్రమణను మానుకుని హెచ్‌సీయూ భూములను వదిలేయాలనిడి మాండ్ చేశారు. ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే అవే విధానాలు అమలు చేస్తే ఏమనాలని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రజాస్వామ్యం కోసం, హెచ్‌సీయూలో పర్యావరణాన్ని ఆ యూనివర్సిటీ భూములను కాపాడటానికి పోరాడుతున్న విద్యార్థులకు మద్దతుగా ప్రజాస్వామిక వాదులు నిలబడాలని పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గిరికుమార్ కల్కోట

వెల్దండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైం నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ క్రైంపై విద్యార్థులకు, యువకులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బెట్టింగ్ ఫ్రాడ్స్, ఐపీఎల్ టికెట్ ఫ్రాడ్స్ ఇతర వాటిపై అవగాహన కల్పించారు. బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వరాదని అన్నారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి,పీఏసీఎస్ డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్య గౌడ్, హెచ్ఎం సుగుణ ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చారకొండ : సైబర్ నేరాల బారిన పడకుం డా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ శంషోద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాలపై ఎస్ఐ ఆధ్వర్యంలో బుధవారం మం డలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి అవ గాహన కల్పించాలరు. వ్యక్తిగత, బ్యాంకు, ఆధార్‌కార్డు, ఓటీపీ తదితర వివరాలను అడిగితే చెపొద్దని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య, శేఖర్, జంగయ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన నిఘా

(5వ పేజీ తరువాయి..)

కుంటిసాకులు పరోక్షంగా చెబుతున్నారు. అక్కడికేదో ప్రేమ జంటల కోసమే ఆ పార్కులు ఏర్పాటు చేసినట్లు.

● వనపర్తి జిల్లాలో ఎకో పార్కు కూడా ప్రేమ జంటలకు ఆవాసంగా మారింది. పూర్తిగా చెట్లతో కమ్ముకుని ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదిక అవుతోంది. జిల్లా కేంద్రంలోనే ఈ పార్కు ఉన్నా.. ఇప్పటి వరకు పెట్రోలింగ్ కూడా చేయడం లేదు. తిరుమలయ్య గుట్ట సమీప అటవీ ప్రాంతం కూడా గతంలో నుంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గతంలో ప్రేమ జంటలను బెదిరించి.. డబ్బులు దోచుకెళ్లిన ఘటనలు కూడా ఇక్కడ జరిగాయి.

● గద్వాల జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీ, ఆర్డీవో కార్యాలయం వెనుకవైపు, రాఘవేంద్ర కాలనీ శివారు ప్రాంతాలను కూడా ఇలాంటి అడ్డాలకు వాడుకుంటున్నారు. ఇటీవల ఓ యాచకురాలికి కల్లు తాగించిన కొందరు ఆకతాయిలు అత్యాచారం చేసినట్లు తెలిసింది. కానీ అది బయటకు రాలేదు.

● నారాయణపేటలో దేవాలయం పక్కన ఎకో పార్కు నిర్మించగా.. అది ప్రేమ జంటలకు నెలవుగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు కూడా అక్కడ జరుగుతున్నాయి.

● మహబూబ్‌నగర్‌లోని ఎకో పార్కులో కేవలం 12 సీసీ కెమెరాలు మాత్రమే ఎంట్రెన్స్ నుంచి కొద్దిదూరం వరకు ఉన్నాయి. ఇక్కడకి కూడా ప్రేమ జంటలు వచ్చి వెళ్తుంటాయి. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉంది. కానీ ఇప్పటివరకు ఎలాంటివి బయటకు రాలేదు. అలాగే దేవాలయాలకు వెళ్తున్న జంటలు చుట్టుపక్కల జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్తూ ఆకతాయిల బెదిరింపులకు గురవుతున్నారు.

● సోమశిల కాటేజీలను కూడా చాలామంది దుర్వినియోగం చేస్తున్నారు. వచ్చిన వారు ఎవరూ, ఏంటి అనేది చూడకుండానే రూమ్‌లు ఇస్తుండటంతో దుర్ఘటనలు జరిగే అవకాశం ఉంది.



గంజాయి

గంజాయి, మందు సిట్టింగులకు అడ్డాలు..

పార్కులు, అటవీ ప్రాంతాలు, జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలు గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. తాగిన మైకంలో అక్కడికి వస్తున్న ప్రేమ జంటలను బెదిరించడం, లైంగిక వేధింపులకు గురిచేయడం పరిపాటిగా మారుతోంది. పరువు పోతోందని ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ప్రతీ జిల్లాలో ఇలాంటి ప్రాంతాల్లో కొన్ని బ్యాచులు ఏర్పడి ఇదే పనిగా పెట్టుకుంటున్నాయి. బెదిరించి డబ్బులు గుంజడం కొందరు చేస్తుండగా.. మరికొందరు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తల్లిదండ్రుల పర్యవేక్షణ తక్కువ కావడం, కాలేజీలకు అని చెప్పి వచ్చి బలాదూర్ తిరగడం, సిగరెట్లు, మందు, గంజాయి తాగడం నానాటికీ పెరుగుతోంది. అదే సమయంలో పార్కులు, ఎక్కువ మంది వచ్చే ప్రదేశాల్లో నిఘాను కూడా కట్టుదిట్టం చేయడం లేదు. మయూరీ నర్సరీలో కేవలం 12 కెమెరాలు మాత్రమే ఉన్నాయి. మెజారిటీ పార్కుల్లో ఎంట్రెన్స్ మినహాయించి.. ఎక్కడా నిఘా ఉండటం లేదు. సీసీ కెమెరాల నిఘా పెట్టి, సూచిక బోర్డులు పెట్టడం ద్వారా అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయొచ్చు. జడ్చర్ల శివారులో యువకులు తరచూ గంజాయి తాగుతున్నారు.

గతంలో యువకులు కూడా పట్టుపడ్డారు. ఖిల్లాఘణపురం మండలంలో గుట్ట పరిసర ప్రాంతాల్లో హుక్కా తాగడం, గంజాయి తాగడం జరుగుతోంది. దొంతికుంట తండాలో మోడల్ స్కూల్ ఉండటంతో అక్కడ ఆకతాయిల ఆగడాలు కూడా పెరిగాయి. పెబ్బేరు మునిసిపాలిటీలోని సంత ప్రాంతాన్ని తాగుబోతులు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం తాగడం, దొంగతనాలకు పాల్పడటం వంటివి ఇక్కడ చేస్తున్నారు. రేవల్లి మండలంలో కూడా యువకులు గంజాయి సేవిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దేవాలయాల ఆవరణలో కూడా మద్యం తాగుతున్నారు. అలాగే మద్యం తాగుతూ పేకాట ఆడటం, ఆ మత్తులో జనసంచారం తక్కువ ఉన్న ప్రాంతాలకు ఎవరైనా వస్తే వేధింపులు చేయడం పరిపాటిగా మారుతోంది. సీసీ కెమెరాలను పార్కులు, దేవాలయాల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు పెట్టడంతోపాటు.. పెట్రోలింగ్‌ను కూడా పెంచితే అనుచిత, అసాంఘిక ఘటనలకు కళ్లెం వేయొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని కంబాలాపూర్ సమీపంలోని రైస్ మిల్ వద్ద మంగళవారం రాత్రి కుక్క వెంబడించడంతో బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన పాఠకులకు విధితమే. వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చింతలయ్య, దుబ్బ చింతలయ్య (60)కు తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం దుబ్బ చింతలయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

సంపులో పడి బాలుడి మృతి


మానస్ మృతదేహం

మద్దూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని దంగాన్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకోంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహిపాల్ కుమారుడు మానస్ (4) ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు. గమనించిన బాలుడి తల్లి, నాయనమ్మ సంపులో నుండి తీసి చికిత్స నిమిత్తం మద్దూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి

▸▸ చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలింపు


బాలుడు కిందపడిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల భవనం పైనుంచి విద్యార్థి దూకి గాయపడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లిలోని గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థి శ్రవన్ ఆరవ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పాఠశాల భవనంపైకి వెళ్లి కిందికి దూకాడు. గదిలో స్నేహితుడు లేడని గమనించిన తోటి విద్యార్థులు వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. వార్డెన్ చుట్టుపక్కల పరిశీలించగా పాఠశాల వెనుక భాగంలో కింద పడి ఉండటంతో ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించి చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. గదిలో నుంచి ఎవరికీ చెప్పకుండా పాఠశాలపైకి వెళ్లి కిందకి దూకాడని, కుటుంబ సమస్యల కారణంగానే దూకి ఉండొచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు. బుధవారం జిల్లా జోనల్ అధికారి రాణి, వాణిశ్రీ తహసీల్దార్ కృష్ణయ్య పాఠశాలను సందర్శించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

చిరుత దాడిలో గేదె మృతి

మరికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో గేదె మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని మాదారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కుర్వ వెంకటేశ్ తన గేదెను మంగళవారం రాత్రి పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా గేదె మృతి చెందింది. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు గేదెను పరిశీలించి చిరుత దాడి చేసిందని నిర్ధారించారు.

స్టేట్‌హోమ్‌కు అనాథ పిల్లల తరలింపు

మరికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం గాజులయ్య తండాకు చెందిన రేణుక, మహేశ్‌ను బుధవారం స్టేట్ హోమ్ అధికారి కవితకు గ్రామస్థులు అప్పగించారు. ఈసందర్భంగా మాజీ ఉపసర్పంచ్ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ భార్యాభర్తలు దేగవత్ లక్ష్మి, రాములునాయక్ ముంబాయికి వలస వెళ్ల గా, భర్త 2019లో అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. అప్పటి నుంచి తల్లి తండాలో ఇద్దరు పిల్లలను చూసుకుంటూ కూలీ పని చేసేది. ఈమె నాలుగు నెలల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతుండేది. గ్రామస్థుల సహకారంతో వైద్యం చేయించుకుంటుండగా, గతనెల 21న పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఆమె మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారడంతో తండా వాసులందరు కలిసి పిల్లల సంరక్షణ కోసం సంబంధింత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సేట్‌హోమ్ అధికారులు తండాకు వచ్చి విచారణ జరిపి పిల్లలను తీసుకెళ్లడం జరిగిందన్నారు.

రైలులో తప్పిపోయిన బాలిక..

సఖి సెంటర్‌కు తరలింపు


గద్వాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలిక రైలులో వస్తుంటే గుర్తించిన పోలీసులు సఖి సెంటర్‌కు తరలించిన ట్లు జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌ న్సెలర్ సురేష్, 1098 కోఆర్డినేటర్ శివలీల తెలిపారు. బుధవారం ఉదయం ఓ బాలి క మహబూబ్‌నగర్ నుంచి రైలులో వస్తుంటే గద్వాల రైల్వే పోలీసులు గుర్తిం చారు. 1098కు కాల్ చేయగా జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు బాలల సంరక్షణ విభాగం కౌన్సెలర్, 1098 కోఆర్డినేటర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆ బాలికను చైల్డ్ వె ల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. బాలికది చేగుంట గ్రామం తిమ్మాజిపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా అని తెలి పిందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు ప్రస్తుతం గద్వాలలోని సఖి కేంద్రాం లో ఉంచామని, గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగిస్తామని వారు పేర్కొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ఊర్కొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఠాకూర్‌తండా, మఠం తండా, అమ్మపల్లితండాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ టీం దాడులు చేసి 300 లీటర్ల బెల్లం పానకం, పది లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఠాకూర్ తండాకు చెందిన రమావత్ రవిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, సిబ్బంది యాదగిరి, రఘు, నర్యా, మాధవి, పరశురామ్ పాల్గొన్నారు.

ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదని..

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం


గొల్ల భోగం శివ (ఫైల్)

మూసాపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖర్చుల కోసం డబ్బులు అడిగితే ఇవ్వలేదని యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో చోటు చేసుకుంది. మూసాపేట ఎస్‌ఐ ముల్కలపల్లి వేణు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన గొల్ల బోగం శివ (32) కూలీ పని చేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. ఖర్చుల కోసం తల్లితో గొడవ పడి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. పక్క గ్రామమైన మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని ఎన్‌హెచ్-44 సోలార్ గేట్ వద్ద ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

▸▸ ఆదర్శంగా నిలుస్తున్న సింగోటం ప్రాథమిక పాఠశాల

▸▸ సొంత ఖర్చుతో బ్రోచర్లు ముద్రించి హెచ్ఎం ప్రచారం

▸▸ విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చర్యలు


సింగోటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

కొల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్ది విద్యార్థులను ప్రగతి బాటలో నడిపిస్తున్నారు ఉపాధ్యాయులు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న బ్యంగి కృష్ణ ప్రసాద్ తనదైన శైలిలో పాఠశాలను తీర్చిదిద్దారు. సొంతంగా బ్రోచర్‌ను తయారు చేసి గ్రామంలో తల్లిదండ్రులకు వివరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు. వేసవి సెలవుల కన్నా ముందే ఈ నెల 5వ తేదీ నుంచి ప్రతి రోజు పాఠశాల ముగిసిన తర్వాత, తనతో పాటు ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో బడి బాట నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 91 మంది విద్యార్థుల సంఖ్య నుంచి 2వేలకు పైగా పెంచేలా పాఠశాల ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నారు. పాఠశాలలో ప్రతీ నెల తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తూ సలహాలు సూచనలు ఇస్తున్నారు. అదేవిధంగా పాఠశాలకు ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థులు మధ్యలో అపరిచితుల వ్యక్తుల వాహనాలు ఎక్కకుండా ప్రధానోపాధ్యాయుడు కారులో విద్యార్థులను తీసుకెళ్తున్నారు. పాఠశాలలో నిర్వహించే పలు సాంస్కృతిక క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ప్రోత్సహించేలా వారికి ఉన్నత విద్యాధికారులచే ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందిస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే నిధుల నుంచి పాఠశాలకు రూ.30 లక్షలు కేటాయించ డంతో విద్యార్థులకు మౌలిక వసతులు అన్నీ సమకూరాయి. విద్యార్థులకు కంప్యూటర్ విద్యాబో ధన అందించేందుకు రత్నగిరి ఫౌండేషన్ ద్వారా కంప్యూటర్ అందజేశారు. పచ్చని వాతావరణం ఉం డేలా పాఠశాలను తీర్చిదిద్దారు. ఉపాధ్యాయుల కృషితో వచ్చే విద్యా సంవత్సరంలో సింగోటం ప్రభు త్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం తప్పక పెరుగుతుందని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ స్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాల ప్రగతి బ్రోచర్

మెరుగైన విద్య అందించడమే..



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం అంకిత భావంతో మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తాను. ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా తోటి ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వసతులు, పౌష్టికాహారం అందిస్తున్నాం. తల్లిదండ్రులను చైతన్య పరుస్తు ప్రతి విద్యార్థిని ప్రభుత్వ బడిలో చేర్పించేలా చర్యలు చేపడుతున్నాం.

- బ్యంగి కృష్ణ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

'ఆర్థిక మోసగాడికి నేతల అండ'

మక్తల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల క్రితం షేర్‌మార్కెట్ పేరుతో షేక్ సుభానీ స్థానికంగా దాదాపు 200మంది బాధితుల నుంచి రూ.100కోట్లకు పైగా వసూలు చేసి ఉడాయించిన ఘటనలో నేతల సహకారం ఉన్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కావలిలో ఇదే తరహాలో మోసాలకు పాల్పడి ఫిబ్రవరి 12న పోలీసులకు పట్టుబడ్డాడు. విషయం వెలుగులోకి రావడంతో ఈ ప్రాంత బాధితులు అక్కడి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎదుట తమ బాధను వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్ ప్రత్యేక చొరవ తీసుకొని కోర్టు అనుమతితో మక్తల్ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి నిందితుడి నుంచి వివరాలు రాబట్టారు. అతడి ల్యాప్‌టాప్‌లో అనేక విషయాలు నమోదు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంత రాజకీయ నాయకులకు ఇచ్చిన మాముళ్లు, ఏజెంట్లకు ఇచ్చిన కమీషన్ వివరాలు సేకరించారు. షేక్‌సుభానీ చాకచక్యంగా రూ.కోట్లు వసూలు చేసి అప్పట్లో జ్యువెలరీ దుకాణం సైతం ప్రారంభించాడు. షేక్‌సుభానీ పరారీ విషయాన్ని పసిగట్టిన ఓ నాయకుడు దుకాణంలో ఉన్న బంగారు ఆభరణాలు సైతం కాజేసినట్లు ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేసుకున్నాడు. మరికల్ పట్టణానికి చెందిన ఓ యువకుడు రూ.5.36 కోట్లు షేక్ సుభానీ వద్ద పెట్టుబడి పెట్టాడు. అలాగే పట్టణానికి చెందిన మైనా ర్టీ నాయకుడు రూ.70లక్షలు పెట్టుబడి పెట్టాడు. మాగనూరు, కృష్ణ, నర్వ, ఊ ట్కూర్ మండలాలకు చెందిన అనేక మంది అప్పులు చేసి మరీ పెట్టుబడి పె ట్టారు. ప్రజలను సులువుగా మోసం చేయడానికి ఊట్కూర్ పట్టణానికి చెందిన ఓ ప్రముఖ వ్యక్తికి భూమి కొన్నట్లు అగ్రిమెంట్ చేసుకొన్నాడు. పట్టణానికి చెందిన ఓ రాజకీయ నాయకుడికి అడ్వాన్సుగా భూమిని కొనుగోలు చేసేందుకు నగదు చెల్లించాడు. విషయం తెలిసిన పోలీసులు అప్పట్లో షేక్ సుభానీ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అతని ఆస్తులను జప్తుచేసి మోసపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శాంతి భద్రతలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం

▸▸ హెచ్‌సీయూ భూముల వ్యవహారం డైవర్షన్ పాలిటిక్స్

▸▸ బీసీలకు 56 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

▸▸ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ విమర్శించారు. హోంశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే మహిళలకు అఘాయిత్యాలు జరగడం శోచనీయన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 26న బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మహనీయుల జాతర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బహుజన మహిళలపై అఘాయిత్యాల జరడం ఆందోళనకరమన్నారు. యువత గంజాయికి అలవాటు పడి మహిళలపై దారుణాలకు ఒడిగడుతున్నారని, శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల షాద్‌నగర్‌లో దళిత మహిళ, కొల్లాపూర్‌లో గిరిజన మహిళలపై అఘాయిత్యాలు జరుగగా, తాజాగా ఊర్కొండపేటలో బీసీ మహిళపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. చివరకు పుణ్యక్షేత్రాల వద్ద కూడా ప్రజలకు భద్రత కరువైందన్నారు. మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి మరోమారు ఇలాంటివి కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని, బీసీ రిజర్వేషన్లపై బహుజనులు ఉద్యమానికి సిద్ధమైన వేళ హెచ్‌సీయూ భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం చర్చలోకి తీసుకొచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే అది నాయకత్వంతో పార్లమెంట్‌లో మాట్లాడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిషానీ రామచంద్ర, దాగిళ్ల దయానంద్‌రావు, శివరామకృష్ణ, చంద్రశేఖర్, గుండెల ధర్మేందర్, అంతటి నాగన్న, పృథ్వీరాజ్, రాంచందర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

▸▸ ఆర్ఎం సంతోష్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎం సంతోష్‌కుమార్

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కస్తామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పారిశ్రామిక వాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించాలని సూచించారు. వారికి డాక్టర్‌ను అందుబాటులో ఉంచామని, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసి మందుల సరఫరాలో కొరత లేకుండా చేశామన్నారు. బకాయిలను సంస్థ ఎండీకి నివేదికను పంపి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. జీవితకాలపు ఉచిత ప్రయాణ బస్‌పాస్ జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారిస్తామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చిన మొదటి ప్రాధాన్యత నిచ్చి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడుతూ సర్వీసులో ఉండి చనిపోయిన ఉద్యోగస్తుల వారసులకు వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, 2022 ఏప్రిల్ నుండి రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలు, 2017 పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో జీబీ పాల్, భగవంతు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.నారాయణ, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, లలితమ్మ, బుచ్చన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్వేయర్ బెల్ట్ సిద్ధం

▸▸ వేగం పుంజుకోనున్న సహాయక చర్యలు

▸▸ 13.600 నుంచి 13.730 కిలో మీటర్ల వరకు బెల్ట్ పొడిగింపు


టీబీఎం శిథిలాలను కత్తిరిస్తున్న రెస్క్యూ టీం సభ్యులు


సొరంగంలో సిద్ధం అయిన కన్వేయర్ బెల్ట్

దోమలపెంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో బురద మట్టి శిథిలాలను తొలగించేందుకు కన్వేయర్ బెల్ట్ పాత్ర కీలకం. సహాయక చర్యల్లో వేగం పెంచేందుకు రెస్క్యూ బృందాలు మూడు రోజులు శ్రమించి కన్వేయ ర్ బెల్ట్ ట్రాక్‌ను బుధవారం 13.600 కిలో మీటర్ల నుంచి 13.730 కిలో మీటర్లకు పొడిగిస్తూ సిద్ధం చేశారు. దీంతో పాటు టీబీ ఎంకు సంబం ధించిన ఇనుప గడ్డర్లను రెస్క్యూ బృందాలు ప్లాస్మా, గ్యాస్, థర్మల్ కట్టర్లతో కత్తిరించి లోకో ట్రైన్ ద్వా రా బయటకు తరలిస్తున్నారు. గురు వారం నుంచి కన్వేయర్ బెల్ట్‌పై మట్టి బురద తరలించడంతో పాటు, ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేపట్ట నున్నట్లు సహాయ చర్యలో పాల్గొనే రెస్క్యూ బృందాల అధికారులు చెబుతున్నారు.

పీయూలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ వర్తింపు


పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు పూలబొకే అందజేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించి ఈఎస్ఐ అమలు చేశారు. దీంతో బుధవారం పీయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దాదాపు 20ఏళ్లు కావస్తున్నా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, తాత్కాలిక ఉద్యోగులందరికీ కనీస వేతనాలను పెంచాలనీ, ఏటా 12శాతాన్ని అమలు చేయాలని కోరారు. స్పందించిన వీసీ త్వరలోనే వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగుల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం


యాదవనగర్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని యాదవనగర్‌లో వెలసిన వీరభద్రస్వామి రథోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 5 గంటలకు అగ్నిగుండం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం రాత్రి నిర్వహించిన భజన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గురువారం పల్లకీసేవ, కోలాటం, భజనలు ఉంటాయని అర్చకులు శివయ్య, సంతోష్, వీరభద్రస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మిడ్జిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడికే వేంకటేశ్వరస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు యుగంధర్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి పాల్గొన్నారు.

అర్చకుడి వ్యవహారంపై విచారణ


మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి

అలంపూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ వ్యవహారంపై బుధవారం దేవాదాయశాఖ అధికారులు విచారించారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ.. అర్చకుడు ఆనంద్‌శర్మపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర పూర్తి విచారణ చేపట్టామన్నారు. ఆలయంలోని ఉద్యోగులను విచారణ చేసి వారి నుంచి పూర్తి వివరాలు తీసుకున్నాం. ఈ నివేదిక కమిషనర్‌కు రెండు రోజుల్లో అందిస్తామన్నారు. ప్రభుత్వం సంపూర్ణంగా నివేదిక సేకరించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఇంటర్వ్యూ..

పంటల సస్యరక్షణలో లింగాకర్షక బుట్టలు ఎంతో ఉపయుక్తం

- డాక్టర్ ఒంగోలు శైల, సస్యరక్షణ శాస్త్రవేత్త, పాలెం



బిజినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పంటల సస్యరక్షణలో లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు, లైట్ ట్రాప్స్ వివిధ రకాల పురుగులను, కీటకాల ఉధృతి వల్ల పంటలకు కలిగే ఆర్థిక నష్టపరిమితిని తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చని పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఒంగోలు శైల ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. లింగాకర్షక బుట్టలు, జిగులు అట్టలు వంటి ట్రాప్స్ వినియోగించడం వల్ల పురు గుల మందుల పిచికారి తగ్గించడం ద్వారా పర్యావరణానికి, మానవులకు, పంటలకు మేలు చేసే మిత్ర పురుగులకు, పశువులకు నష్టం జరగదు.

లింగాకర్షక బుట్టలతో ఏయే రకాల పురుగుల ఉధృతిని అరికట్టవచ్చు?

లింగాకర్షక బుట్టల్లో ఉండే వ్యూర్ మగ రెక్కల పురుగులను ఆకర్షించడం వల్ల ఆడ రెక్కల పురుగులతో కలయికలేకపోవడంతో గుడ్లు పెట్టకుండా చేస్తుంది. ఇవి కత్తెర పురుగు, గులాబీ రంగు పురుగు, శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, కొమ్ము పురుగులను అరికట్టి పంటకు నష్టం జరకుండా రక్షించుకోవచ్చు. అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకుంటే ఎంతో లాభదాయకం.

రసం పీల్చే పురుగులు, తామర పురుగులు, తెల్లదోమ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

సాగు చేసిన పంటలను రసం పీల్చే పురుగులను నియంత్రించుకోవడానికి జిగురు అట్టలను పొలంలో అక్కడక్కడా ఉంచాలి. అలాగే తెలుపు, నీలం రంగు అట్టలను తామర పురుగులను అరికట్టేందుకు, పసుపు పచ్చ అట్టలు తెలదోమను నివారించుకునేందుకు ఏర్పాటు చేసుకోవాలి.

ఎకరాకు ఎన్ని బుట్టలు ఏర్పాటు చేయాలి

మొక్కజొన్నలో కత్తెర పురుగును అదుపు చేసుకోవడానికి ఎకరానికి 4, 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరాకు 4 బుట్టలు, వేరుశనగలో పొగాకు లద్దె పురుగు కోసం 4, 5 బుట్టలు, కందికి ఆశించే మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు ట్రాప్‌కు 4 బుట్టలు, పెసర, మినుములో కాయ తొలిచే పురుగు నివారణకు ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చు. రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

న్యూస్ బాక్స్

ఘనంగా స్వామివారి కల్యాణం

వంగూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలోని కొండారెడ్డిపల్లిలో దిద్దబండ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణమహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గున్న శ్రీనివాస్ రెడ్డి, ఈవో హిందుకుమార్ పాల్గొన్నారు.

ఆవంచలో వార్షిక బ్రహ్మోత్సవాలు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో వెలిసిన మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పల్లకి సేవ నిర్వహించారు. వేద పండితులు వంశీ ఆధ్వర్యంలో హోమాలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆల య కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యవసాయానికి కోతల్లేని విద్యుత్ ఇస్తున్నాం : ఏఈ

కల్వకుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ఏఈ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వేసవికాలంలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సిబ్బంది వెంటనే స్పందించి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్‌కు డిమాండ్ ఉన్నా, వ్యవసాయానికి ఇస్తున్నామని తెలిపారు. రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించా లని, ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన సూచించారు. అధికారులం నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

అరెస్టు చేయడం అప్రజాస్వామికం : ఎల్‌హెచ్‌పీఎస్

చారకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : లంబాడ జాతికి ప్రభుత్వం మంత్రి పదవి కేటాయించాలని కోరుతూ లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజా స్వామికమని ఆ సంఘం మండల అధ్యక్షుడు సరిరాం నాయక్ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి లంబాడ జాతికి మంత్రి పదవి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఎల్‌హెచ్‌పీ ఎస్ నాయకులు రాజేష్‌నాయక్, మల్లేష్ నాయక్, శ్రీరాంనాయక్, బలరాంనాయక్, గణేష్ నాయక్ ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ ఘనత రేవంత్‌రెడ్డిదే

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్/ కొల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో మొట్టమొదటి సారిగా ఉచిత సన్న బియ్యం పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం సాయంత్రం కొల్లాపూర్ పట్టణంలోని 1, 2, 31 రేషన్ షాపుల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి జూపల్లి మహిళలతో మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేని విధంగా మన రాష్ట్రంలో పేద కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం మేనిఫెస్టోలో లేని పథకాన్ని కూడా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అమరేందర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాజేందర్ ఆర్డీవో భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు నరసింహారావు, బోరెల్లి కరుణ, మహేష్, ఎండీ నయుం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్సీ

పేదల సంక్షేమమే పరమా వధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్సీ కూ చకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని పలు రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అమరేందర్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు నివాళి

సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా పాత ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పూల మాల వేసి నివాళి అర్పించారు.

సామాజిక సేవకు ప్రాధాన్యం

స్వచ్ఛంద సేవా సంస్థలు, కుల సంఘాలు సామాజిక సేవకు పూనుకో వాలని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సమీపంలోని నెలకొల్పిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయా కార్య క్రమాల్లో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, వంగ పకీరయ్యగౌడ్, అన్నసాగర్ నారాయణగౌడ్, నాగేంద్రంగౌడ్, బాలగౌడ్, మురళిగౌడ్, రమేష్ గౌడ్, జగదేక్ శ్రీనివాస్‌గౌడ్, నాగరాజుగౌడ్, కూచకుళ్ల నరసింహరెడ్డి, రెడ్డిసేవా సమితి జిల్లా అధ్యక్షుడు దొడ్ల నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, దొడ్ల ఇందుమతి, యశోదారెడ్డి, బుసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాగనూల్ కృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్, మాజీ కౌన్సిలర్లు మహమ్మద్ నిజాం, సునేంద్ర, జక్కరాజు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

సన్నబియ్యం పంపిణీ

చారకొండ : రాష్ట్ర ప్రభుత్వం అహారభద్రత కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుందని కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరక్టర్ గోలి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా రాంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో రేషన్‌షాపు వద్ద కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ నరేందర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి ఎస్‌కే. ఖదీర్, మాజీ ఉపసర్పంచ్ భగవాన్, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఈదమయ్య, అలివేలు, తిరుపతయ్య, రాములు, లింగాచారి, లక్ష్మయ్య, సురేష్, మణిపాల్, కూమార్‌సింగ్, భీమ్లానాయక్ పాల్గొన్నారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

- డీఈవో రమేష్‌కుమార్

కల్వకుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయని డీఈవో తెలిపారు. చివరగా సాంఘికశాస్త్రం పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి 12:30గంటల వరకు పరీక్ష జరిగిందని తెలిపారు. ఆయన బుధవారం కల్వకుర్తి పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లాలో ఎలాంటి కేసులు నమోదు కాకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 8 గంటలకు కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌న ఉండి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని 60 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షించారు.

కిటకిటలాడిన బస్టాండ్

అచ్చంపేటటౌన్ : పదవ తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పట్టణంలో 6పరీక్షా కేంద్రాలలో 640మంది పరీక్షలకు హాజరయ్యారు. హాస్టళ్ల నుంచి విద్యార్థులు సొంత గ్రామాలకు తరలివెళ్లారు. అచ్చంపేట బస్టాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు తమ సామన్లతో సొంత ఊర్లకు ప్రయాణమయ్యారు.

● తాడూరు : మండలంలో పదవ తరగతి పరీక్షలు బుధవారంతో ముగిసిశాయని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సహకరించిన పరీక్ష కేంద్రం ఇన్విజిలేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

● కల్వకుర్తి టౌన్ : కల్వకుర్తిలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంఈవో ను ఫోన్‌లో సంప్రదించగా పట్టణంలో 8 పరీక్ష కేంద్రాల్లో 77మంది పర్యవేక్షకులు, 16 మంది సీఎస్‌లు పర్యవేక్షించారని తెలిపారు.

ఘనంగా వీడ్కోలు

తాడూరు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డీఈవో రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో శోభారాణి, ఎఫ్ఏవో మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో సామగ్రితో బస్టాండ్‌కు వెళుతున్న విద్యార్థులు, వారి కుటుంబీకులు

హెచ్‌సీయూ భూముల వేలం ఉపసంహరించుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

నాగర్‌కర్నూల్ టౌన్/ కొల్లాపూర్/ పెంట్లవెల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల అమ్మకాన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం సీపీ ఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అలాగే కొల్లాపూర్‌లో సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌర స్తాలో, పెంట్లవెల్లిలో సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కొల్లాపూర్‌లో పర్వతాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్ర భుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడం కోసం విలువైన భూములను అమ్మడం దుర్మా ర్గమైన చర్యయని పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడేందుకు ఉద్యమిస్తున్న ఎస్ ఎఫ్ఐ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆర్.శ్రీనివాస్, కె.గీత, రామయ్య, అశోక్, మధు, గోవింద్, రవి, మల్లయ్య, బత్తిని రాము, వంశీ, కొల్లాపూర్‌లో సీపీఎం నాయకులు ఎండి సలీం, బాలపీర్, బత్తిని రాజు, నెనావత్ బాలు నాయక్, శివ శంకర వరప్రసాద్, కార్తీక్, బంకల సతీష్, పెంట్లవెల్లిలో సీపీఎం నాయకులు తిమ్మస్వామి, నరసింహ, అబ్దుల్లా, పెంటయ్య, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

అమ్రాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయం సమీపంలో నాలుగు రోజుల క్రితం జరిగిన సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డీటీఎఫ్ అమ్రాబాద్ మండలశాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అమ్రాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన చేసిన నిరసన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, ప్రధాన కార్యదర్శి శివలింగం, డీటీఎఫ్ నేతలు కె. ఎల్లయ్య, విజయ మోహన్, పరిశయ్య, విజయ్, నాగార్జున్, మోహన్, రజిత, ప్రవళిక, శ్రావణి, అంబేడ్కర్ యువజన సంఘం మండల శాఖ అధ్యక్షులు ఎల్లస్వామి నాయకులు ఉన్నారు.



అమ్రాబాద్ : అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

నిందితులను శిక్షించాలి : కేవీపీఎస్

తాడూరు : ఊర్కొండపేటలో మహిళపై అత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. తాడూరులో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర నింది తులను కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. దేవాలయం దగ్గర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాములమ్మ, చిన్నమ్మ, కృష్ణమ్మ, చిన్నయ్య, చంద్రకళ, నాగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

చారకొండ : ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి వచ్చిన మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ అడ్వకేట్ గుండె వెంకట్‌గౌడ్ బుధవా రం ఒక ప్రకటనలో కోరారు. ఈఘటనపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి అత్యాచారానికి పాల్పడిన దుండగులకు కఠిన శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

కొల్లాపూర్ : ఊరుకొండ పేటలో మహిళపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. బీఎస్ ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్, బీఆర్‌ఎస్‌వి జిల్లా నాయకుడు శేఖర్, ఎస్‌ఎస్‌యు స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా నాయకుడు చింటూ మాట్లాడుతూ... ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులకు తక్షణమే శిక్ష పడేలా చేయాలని, ప్రభుత్వం బాధిత మహిళకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

సీపీఎం జెండావిష్కరణ

కోడేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం 24వ జాతీయ మహాసభల ప్రారంభ సూచికగా బుధారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీపీఎం జెండాను ఆ పార్టీ మండల కార్యదర్శి పి. నరసింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం పార్టీ 24వ అఖిల భారత మహాసభలు ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మతతత్వ పార్టీలు దేశంలో శాంతి భద్రతలకు ఆటంకం కల్పిస్తూ మతాల కులాల మధ్యన అంతరాలు పెంచుతూ అలజడి సృష్టించారన్నారు. భవిష్యత్‌కార్యాచరణపై మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.రవి పి.రవి, కె. లక్ష్మయ్య, వి.రాజు, వి.రాజేష్, గ్రామ పంచాయతీ కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఫసియొద్దీన్

కందనూలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన సయ్యద్ ఫసియొద్దీన్‌కు జిల్లా కోర్టు న్యాయాధికారి డి.రాజేష్‌బాబు నియామక పత్రం అందజేశారు. సయ్యద్ ఫసియొద్దీన్ మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులకు, న్యాయవాదులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ల

గ్రామ పంచాయతీ స్థలాలు కాపాడాలి

ఊర్కొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ స్థలం కాపాడాలని గ్రామస్థులు తహసీల్దార్ రామ్ కోటికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని సర్వే నంబర్లు 401, 404 గల భూమి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేసి నిరుపేదలకు మాత్రమే ఇచ్చిందని, అందులో మిగులు భూమిన కాపాడాలని వినతిపత్రంలో తెలిపారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

వెల్దండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 4వ రేషన్ దుకాణంలో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ ప్రారంభిచారు. పీఏసీఎస్ డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడ్, నాయకులు పర్వత్‌రెడ్డి, నారాయణ, పుల్లయ్య, శంకర్‌నాయక్ ఉన్నారు.

'అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి'

ఉప్పునుంతల ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యో తి) : మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ బాసానాయక్‌కు కేవీపీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు బాలరాజు, ఎల్లయ్య, ప్రసాద్, లక్ష్మణ్, ప్రశాంత్, శ్రీశైలం, ఆనంద్, అనిల్, లక్ష్మయ్య, సైదులు, సాయిబబాబు, దాసు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మరికల్, దేవునితిర్మలాపూర్, బాచారం, పెద్దకొత్తపల్లి గ్రామాలకు చెందిన ఏడుగురు బాధితులకు మొత్తం 3,75,500ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, నాయకులు దండు నరసింహ, వన్నోజు సత్యంలు లబ్ధిదారులకు అందజేశారు. ఆయా గ్రామాల్లో సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు పగడాల చిన్నయ్య, మాజీ ఎంపీటీసీలు రవికుమార్, శశికళ, శివశంకర్, మాధవి, అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు మల్లేష్, మశన్నఉన్నారు.

● కొల్లాపూర్ : కొల్లాపూర్ మునిసిపల్ పరిధిలోని 16వ వార్డుకు చెందిన వేముల వినయ్ కుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం కొల్లాపూర్ మునిసిపల్ 16వ వార్డు మాజీ కౌన్సిలర్ సిబ్బడి నరసింహారావు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు వడ్ల పురేందర్, సుధాకర్ సింగ్, రాము పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే తన నివాసంలో అచ్చంపేట డివిజన్ అధికారులు, నాయకుల తో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దటి తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీలో ఎటు టవంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. అధికారులు ఎవరూ కూడా ఈ మూడు నెలలు అలసత్వం వహించకుండా పనుల్లో నిమగ్నం కావాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం, సన్నబియ్యం పథకంపై సమీక్షించారు. కార్యక్ర మంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హెమలత, ఎంపీ డీవోలు మధుసూదన్‌గౌడ్, నాయకులు అనంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారావు, పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన నియోజకవర్గ అధికారులు

బహుజన వీరుడు సర్వాయి పాపన్న



పెద్దకొత్తపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కౌండిన్యదళం నాయకులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నిజాం కోటలు బద్దలు కొట్టి ప్రజారంజక పాలన సాధించిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో మండల కౌండిన్య దళం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌండి న్యదళం మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భర త్‌గౌడ్, ఉపాధ్యక్షు డు రవీందర్‌గౌడ్, సత్యంగౌడ్, సురేందర్‌గౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

● బిజినేపల్లి : మండల కేంద్రంలోని నేతాజీ యువజన సంఘం భవనం ముందు ఉన్న సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహానికి గౌడ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి మాట్లాడారు. అదే విధంగా ఐఎన్‌టీయూసీ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి బంగారి పర్వతాలు జన్మదినం కావడంతో కేక్ కట్ చేసి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంతటి వేణుగోపాల్ గౌడ్, సంఘం జిల్లా కార్యదర్శి చెక్కల రమణ గౌడ్, రాజేందర్ గౌడ్, భగవంత్ గౌడ్, రమేష్ గౌడ్, తిరుపతయ్య గౌడ్, అనిల్ గౌడ్, శివ గౌడ్, నరేందర్ గౌడ్, శంకర్ గౌడ్, చంద్రగౌడ్, వెంకటేష్ గౌడ్, అల్లోజీ, వెంకటస్వామి, రఘుబాబు, వాల్యానాయక్, పరశురాములు, సత్యశీల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బహుజన జాతి ముద్దుబిడ్డ సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పక్కన గల సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వేణుగోపాల్‌గౌడ్, నాగరాజుగౌడ్, చంద్రమౌళిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మురళిధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్, సందీప్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రంజిత్‌గౌడ్, రాములుగౌడ్, రఘుపతిగౌడ్, శివగౌడ్, మహేష్‌గౌడ్, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ అమరేందర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందకు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజవర్గ కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఎస్ఎస్ఎస్, ఇంటర్‌లకు కలిపి మొత్తం 8 సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ 404 మంది, ఓపెన్ ఇంటర్మీడియట్‌కు 736 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రాక్టికల్ పరీక్షలకు 307 మంది హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగరాజు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

-ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

తాడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 9న జరిగే జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో బుధవారం భలాన్‌పల్లి గ్రామ భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ జిల్లా కన్వీనర్ చిన్నపాగ శ్రీనివాసులు, భవన నిర్మాణ జిల్లా నాయకులు దాంగట్ల వెంకటస్వామి, గుల్ల రవి, కొండన్నగౌడ్, గొర్ల సత్యం, బాలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య

-డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య

తాడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు బాల్యవి వాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్నారులు నేటి సమాజంలో వారి హక్కు లను అవగాహన కలిగి ఉండాలని డిప్యూ టీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య అన్నారు. బుధవారం మండలం లోని జిల్లా పరిషత్ ఇంద్రకల్ పాఠశాలలో వి ద్యార్థులకు న్యాయ సేవాలపై అవగాహన సద స్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలన్నారు. అమ్మాయిలు 18 సంవత్స రాలు నిండిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలన్నా రు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు బాలస్వామి, శ్యాం సుందర్, మల్లేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.